ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

పాఠకులకు గమనిక

దీపావళి పండుగను పురస్కరించుకుని 08-11-26 , పత్రికకు సెలవు. తదుపరి సంచిక 10-11-26 యథావిధిగా వెలువడుతుంది. యాజమాన్యం

నవంబర్ 8 ఆదివారం 2026 | సంపుటి : 1 | సంచిక : 30 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

SUNDAY NOVEMBER 8 2026 | VOL:1 | ISSUE: 30 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

ప్రజాబలం యాత్రతో ప్రజల్లోకి వెళ్తా: సీఎం రేవంత్‌రెడ్డి

సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటనలు

కలిసికట్టుగా ఉంటే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవచ్చు

కొడంగల్ అభివృద్ధికి రూ.9 వేల కోట్లతో పనులు

పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయకపోవడంపై కేసీఆర్‌కు ప్రశ్నలు

రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి.. నీటిని పొదుపుగా వాడుకోవాలి

దేశానికే ఆదర్శంగా కొడంగల్‌ను తీర్చిదిద్దుతాం



సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' పేరుతో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటానని చెప్పారు. మనమంతా కలిసికట్టుగా ఉంటే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవచ్చని పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటలో శనివారం నిర్వహించిన రైతుమేళాను సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహ, (మిగతా 2వ పేజీలో..)

కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్

కొడంగల్ ఎత్తిపోతలలో భారీ అవకతవకలు జరిగాయన్న కేటీఆర్

రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని విమర్శ

ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అంటూ తీవ్ర విమర్శ

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు.ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి (మిగతా 2వ పేజీలో..)



ఇరాన్‌తో యుద్ధమే లేదు.. ఇజ్రాయెల్‌ను నేనే కాపాడాను: ట్రంప్

ఇరాన్‌తో జరుగుతున్నది యుద్ధం కాదన్న ట్రంప్

గత ఐదు నెలలుగా ఎవరూ చనిపోలేదని వెల్లడి

ఇరాన్ నుంచి ఇజ్రాయెల్‌ను తానే కాపాడానని వ్యాఖ్య

ఇరాన్ అణు కార్యక్రమం శాంతియుతమేనని టెహ్రాన్ స్పష్టీకరణ



ఇరాన్‌తో నెలకొన్న ఘర్షణను 'యుద్ధం'గా పరిగణించలేమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ విషయంలో వాషింగ్టన్ గణనీయమైన పురోగతి సాధించిందని, ఘర్షణకు ముందు కంటే ఇప్పుడే తాము ఎక్కువ చమురును పొందుతున్నామని పేర్కొన్నారు. (మిగతా 2వ పేజీలో..)

దేశ ప్రజలకు ప్రధాని మోదీ దీపావళి శుభాకాంక్షలు

ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి

చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీక దీపావళి

ఎక్స్ వేదికగా వీడియో సందేశం విడుదల

సైనికులతో కలిసి పండుగ జరుపుకునే సంప్రదాయం కొనసాగింపు



దీపావళి పర్వదినం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాలు సుఖసంతోషాలు, ప్రశాంతత, విజయాలతో వెలిగిపోవాలని ఆకాంక్షించారు. చీకటిపై వెలుగు సాధించిన (మిగతా 2వ పేజీలో..)

'E20 కాస్తా 420గా మారింది'.. ఇంధన సంస్థలు ప్రజలను మోసం చేస్తున్నాయి: రాహుల్ గాంధీ

పెట్రోల్‌లో పరిమితికి మించి ఇథనాల్ కలుపుతున్నారని ఆయిల్ కంపెనీలపై రాహుల్ ఆరోపణ

కర్ణాటక ప్రభుత్వ ల్యాబ్ టెస్టుల్లో 31శాతం వరకు ఇథనాల్ ఉన్నట్లు వెల్లడైందని వ్యాఖ్య

తమపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా ఖండించిన ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థలు

ఈ వివాదంతో వాహనాల మైలేజీ, ఇంజిన్ల భద్రతపై వినియోగదారుల్లో పెరిగిన ఆందోళన

దేశంలోని ప్రధాన చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్‌లో ప్రభుత్వం నిర్దేశించిన 20 శాతం పరిమితికి మించి ఇథనాల్ కలుపుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన ల్యాబొరేటరీ పరీక్షల ఫలితాలను ఉటంకిస్తూ ఆయన శనివారం ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ20 కాస్తా 420గా మారింది -- ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్నారు!" అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తీవ్రస్థాయిలో విమర్శించారు. చమురు సంస్థల టెస్టింగ్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆయన ప్రశ్నించారు.కర్ణాటక ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ విడుదల చేసిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని ఏడు జిల్లాల నుంచి సేకరించిన 14 పెట్రోల్ శాంపిల్స్‌ను ప్రభుత్వ గుర్తింపు పొందిన ల్యాబ్‌లో పరీక్షించగా, 11 శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 20కి మించి ఉన్నట్లు తేలింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) శాంపిల్‌లో 31.2 (మిగతా 2వ పేజీలో..)



డిండికి ఏడుల నుంచి నీళ్లు తేవడం అసాధ్యం: కవిత

నల్లగొండ: ఏడుల నుంచి డిండి రిజర్వాయర్‌కు నీటిని తరలించడం సాధ్యం కాదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. గోదావరి జలాలను నల్లగొండ ప్రాంతానికి తీసుకొస్తేనే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అభిప్రాయపడ్డారు. శనివారం డిండి రిజర్వాయర్‌ను సందర్శించిన ఆమె, నీటి ప్రాజెక్టులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏడుల నుంచి నీటిని తరలించే ప్రతిపాదనలో సాంకేతిక, ఆచరణాత్మక ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. నార్లాపూర్ రిజర్వాయర్ పనుల కారణంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం దెబ్బతిన్నదని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాకే నీటిని అందించడానికి ఎక్కువ సమయం పడుతుందని, ఈ పరిస్థితుల్లో నల్లగొండకు నీటిని తీసుకురావడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు.

బస్వాపూర్ నుంచి నీటిని అందించవచ్చు..

బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి ఉల్పర, శివన్నగూడెం ప్రాంతాలకు నేరుగా గోదావరి జలాలను అందించే అవకాశం ఉందని కవిత వివరించారు. తమ ప్రతిపాదనలోని ప్రయోజనాలను నల్లగొండ జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించాలని సూచించారు. అవసరమైతే ఇంజినీర్లతో (మిగతా 2వ పేజీలో..)



తెలుగు రాష్ట్రాల ప్రజలకు సీఎంల దీపావళి శుభాకాంక్షలు



అమరావతి, హైదరాబాద్, నవంబరు 7:

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఇరువురు ముఖ్యమంత్రులు ప్రకటనలు విడుదల చేశారు. ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి: చంద్రబాబు

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు చిగురించాలని కోరుకున్నారు. మనం వెలిగించే దీపం మన ఇంటికే పరిమితం కాకుండా సమాజానికి కూడా వెలుగునివ్వాలని అభిలాషించారు.

తెలంగాణ ప్రజలకు రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. (మిగతా 2వ పేజీలో..)

విద్యార్థులకు విజయ్ సర్కార్ భారీ కానుక.. ఏకంగా రూ.2,000 కోట్లు!

విద్యార్థుల ఉచిత ల్యాప్‌టాప్‌ల కోసం రూ.2,000 కోట్లు మంజూరు

పథకానికి 'వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్'గా పేరు

డిగ్రీ, డిప్లొమా మొదటి, రెండో ఏడాది విద్యార్థులకు అవకాశం

పలు ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకూ వర్తింపు

ల్యాప్‌టాప్‌లలో ఇంటెల్ కోర్ ఐ5 ప్రాసెసర్ ఉండేలా నిర్ణయం



తమిళనాడు విద్యార్థులకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శుభవార్త చెప్పారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందించేందుకు రూ.2,000 కోట్లు మంజూరు చేశారు. 'వెట్రి ల్యాప్‌టాప్ పథకం' పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ పథకానికి ప్రభుత్వం తాజాగా పరిపాలనా అనుమతులు జారీ చేసింది.ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరంలో (మిగతా 2వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

చీకటిపై వెలుగుల విజయం.. దేశ ప్రజలకు రాష్ట్రపతి, ప్రధాని దీపావళి శుభాకాంక్షలు

వికసిత్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని రాష్ట్రపతి ముర్ము పిలుపు

పర్యావరణ పరిరక్షణ, సౌభ్రాతృత్వానికి ప్రాధాన్యమివ్వాలని సూచన

సద్గుణాల విజయానికి దీపావళి ప్రతీక అని రాష్ట్రపతి సందేశం

జవాన్లతో కలిసి దీపావళి జరుపుకోనున్న ప్రధాని మోదీ

ఉపరాష్ట్రపతితో దీపావళి శుభాకాంక్షలు పంచుకున్న మోదీ





దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ విలువలను అనుసరిస్తూ వికసిత్ భారత్ నిర్మాణంలో యువత ఉత్సాహంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని, సమాజంలో సౌభ్రాతృత్వంతో మెలగాలని సూచించారు. దేశంలో, విదేశాల్లో నివసిస్తున్న భారతీయులందరికీ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.దీపావళి పండుగకు సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యం ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారు. రావణుడిపై విజయం సాధించిన అనంతరం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంలో ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారని గుర్తుచేశారు. ఈ వేడుక రామరాజ్య శుభారంభానికి ప్రతీకగా నిలిచిందన్నారు. చెడు లక్షణాలపై సద్గుణాల విజయం, కష్టాల నుంచి విముక్తి పొంది సుఖసంతోషాలతో కూడిన జీవితం ప్రారంభం కావడాన్ని దీపావళి సూచిస్తుందని తెలిపారు. శుభారంభాల కోసం గణేశుడిని, సంపద, శ్రేయస్సు కోసం మహాలక్ష్మిని పూజిస్తూ అందరి సంతోషం కోసం ప్రార్థిస్తారని వివరించారు. దేశ ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు.మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా దీపావళి సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ చీకటిపై వెలుగుల విజయానికి, చీకటిని పారదోలాలన్న సంకల్పానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, శ్రేయస్సు నిండాలని ఆకాంక్షించారు. ఏటా ఉత్సాహంగా దీపావళి జరుపుకుంటానని, ఈసారి కూడా సరిహద్దుల్లో దేశాన్ని కాపాడుతున్న వీర జవాన్లతో కలిసి పండుగ చేసుకోనున్నట్లు వెల్లడించారు.అంతకుముందు ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌ను మోదీ కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు ఉపరాష్ట్రపతి అయోధ్యలో నిర్వహించే దీపోత్సవం-2026లో పాల్గొనేందుకు శనివారం అక్కడికి చేరుకున్నారు. శ్రీరామ జన్మభూమి ఆలయంలో పూజలు చేయడంతో పాటు శ్రీరాముడి పట్టాభిషేక కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ ఏడాది దీపోత్సవం పదో వార్షికోత్సవం కావడం విశేషం. అయోధ్యలోని 56 ఘాట్లలో 30 నుంచి 33 లక్షల మట్టి దీపాలు వెలిగించాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

దేశ ప్రజలకు ప్రధాని మోదీ దీపావళి శుభాకాంక్షలు

మొదటి పేజీ తరువాయి)

విజయానికి దీపావళి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం తన అధికారిక ఎక్స్ ఖాతాలో వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

సైనికులతో దీపావళి వేడుకలు..

గత కొన్ని సంవత్సరాలుగా ప్రధాని మోదీ దీపావళి పండుగను సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైనికులతో కలిసి జరుపుకుంటున్నారు. దేశ రక్షణ కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ సేవలందిస్తున్న సైనికులతో పండుగను గడపడం సంప్రదాయంగా కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించనున్నట్లు తన వీడియో సందేశంలో వెల్లడించారు.

డిండికి ఏదుల నుంచి నీళ్లు తేవడం అసాధ్యం: కవిత

మొదటి పేజీ తరువాయి)

సాంకేతికంగా తనిఖీ చేయించుకోవాలని కోరారు. ఈ ప్రతిపాదన అమలైతే ప్రాంతానికి ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

ఎస్ఎల్‌బీసీ పనులపై విమర్శలు..

ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు నత్తనడకన సాగుతున్నాయని కవిత విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్లే సొరంగంలో కార్మికులు మృతి చెందారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా టన్నెల్ పనుల విషయంలో కొంత నిర్లక్ష్యం చేసిందని అంగీకరిస్తూ, అందుకు క్షమాపణలు చెబుతున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలి..

పంటలు వేయవద్దని సూచిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ప్రత్యామ్నాయ సహాయం అందిస్తుందో స్పష్టం చేయాలని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, బీఆర్ఎస్ నిద్రమత్తును వదిలించాలంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు.ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి" అని అన్నారు. ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

విద్యార్థులకు విజయ్ సర్కార్ భారీ కానుక.. ఏకంగా రూ.2,000 కోట్లు!

మొదటి పేజీ తరువాయి)

మొదటి, రెండో ఏడాది డిగ్రీ, డిప్లొమా చదువుతున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించనున్నారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఆర్ట్స్, సైన్స్, వైద్య, న్యాయ, వ్యవసాయ, పశువైద్య, మత్స్యశాస్త్ర కోర్సుల విద్యార్థులు కూడా ఈ పథకానికి అర్హులు. గత విద్యా సంవత్సరంలో ల్యాప్‌టాప్‌లు అందుకోని ప్రొఫెషనల్ కోర్సుల మూడు, నాలుగో ఏడాది విద్యార్థులకూ అవకాశం కల్పించారు.ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి సామర్థ్యం ఉన్న ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ఇంటెల్ కోర్ ఐ5 ప్రాసెసర్ లేదా దానికి సమానమైన సాంకేతికత ఉండనుంది. పథకం అమలును పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ల్యాప్‌టాప్‌ల కొనుగోలు బాధ్యతను ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ తమిళనాడు (జూజూ)కు అప్పగించారు. నాణ్యత, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పరికరాలను కొనుగోలు చేయనున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకురావడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఆన్‌లైన్ తరగతులు, సాంకేతిక నైపుణ్యాల అభ్యాసం, ఉద్యోగ అవకాశాలకు సిద్ధమయ్యేందుకు ఈ ల్యాప్‌టాప్‌లు ఉపయోగపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

'E20 కాస్తా 420గా మారింది'.. ఇంధన సంస్థలు ప్రజలను మోసం చేస్తున్నాయి: రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి)

శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) శాంపిల్‌లో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), నయారా ఎనర్జీ, షెల్ వంటి సంస్థల నుంచి సేకరించిన ఇతర శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 25.5 నుంచి 26.5 మధ్య ఉన్నట్లు తేలింది. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణ, రామనగర, మంగళూరు, తుమకూరు జిల్లాల్లో ఈ శాంపిల్స్‌ను సేకరించారు. అధిక మోతాదులో ఇథనాల్ కలపడం వల్ల వాహనదారుల మైలేజీ తగ్గడమే కాకుండా ఇంజిన్‌లు దెబ్బతినే ప్రమాదం ఉందని మంత్రి రిజ్వాన్ అర్షద్ ఆందోళన వ్యక్తం చేశారు. మొదట ఈ శాంపిల్స్‌ను ఆయిల్ కంపెనీల ల్యాబ్‌లకు పంపగా, వారు ఇథనాల్ శాతం వివరాలు వెల్లడించలేదని, అందుకే స్వతంత్ర ల్యాబ్‌లో పరీక్షలు చేయించాల్సి వచ్చిందని ఆయన వివరించారు.

ఆరోపణలను ఖండించిన చమురు సంస్థలు

అయితే, కర్ణాటక ప్రభుత్వం, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సహా అన్ని చమురు మార్కెటింగ్ కంపెనీలు తీవ్రంగా ఖండించాయి. శాంపిల్స్ సేకరణ, పరీక్షా విధానాలు నిర్దేశిత చట్టబద్ధమైన మార్గదర్శకాల ప్రకారం జరగలేదని ఆక్షేపించాయి. తాము దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 893 శాంపిల్స్‌తో జాయింట్ క్వాలిటీ మానిటరింగ్ నిర్వహించామని, అందులో కర్ణాటకకు చెందిన 56 శాంపిల్స్ కూడా ఉన్నాయని తెలిపాయి. ఈ పరీక్షల్లో ఇథనాల్ శాతం 19 నుంచి 21 శాతం మధ్యలోనే ఉందని, కర్ణాటక శాంపిల్స్‌లో సగటున 19.3 శాతంగానే నమోదైందని స్పష్టం చేశాయి. ఈ తాజా వివాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం, దాని ప్రభావంపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. వాహనాల పనితీరు, వినియోగదారులపై పడుతున్న భారంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇరాన్‌తో యుద్ధమే లేదు.. ఇజ్రాయెల్‌ను నేనే కాపాడాను: ట్రంప్

మొదటి పేజీ తరువాయి)

"గత ఐదు నెలలుగా ఈ ఘర్షణలో ఎవరూ గాయపడలేదు, చనిపోలేదు. అలాంటప్పుడు దీన్ని యుద్ధం అని ఎలా అంటారు? ఇది యుద్ధం కాదు" అని ట్రంప్ స్పష్టం చేశారు.ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యల భవిష్యత్ కార్యాచరణపై అనిశ్చితి కొనసాగుతున్న తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికీ సైనిక ప్రత్యామ్నాయాలపై చర్చిస్తున్నప్పటికీ, ఇది యుద్ధం కాదని ఆయన నొక్కి చెప్పడం గమనార్హం.మరోవైపు, ఇరాన్ అణ్వస్త్ర దేశంగా మారకుండా తాను అడ్డుకోకపోయి ఉంటే, ఈ రోజు ఇజ్రాయెల్ సహా మొత్తం పశ్చిమాసియా ఉనికిలో ఉండేది కాదని ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ఈ మేరకు ఒక పోస్ట్ చేశారు. ఇరాన్ అణు ఆశయాలను అడ్డుకోవడంలో తన పాత్ర అందరికీ తెలిసినా, ఎవరూ బహిరంగంగా అంగీకరించరని ఆయన పేర్కొన్నారు. "నేను ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా ఆపకపోతే ఇజ్రాయెల్, వాస్తవానికి మొత్తం పశ్చిమాసియా ఈరోజు ఉండేది కాదు. ఈ నిజాన్ని ఎవరూ చెప్పరు, కానీ అందరికీ తెలుసు!" అని ట్రంప్ తన పోస్టులో రాసుకొచ్చారు.ఇరాన్ అణ్వస్త్రాలను అభివృద్ధి చేయకుండా నిరోధించడమే లక్ష్యంగా 2025, 2026 సంవత్సరాల్లో అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలపై భారీ దాడులు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ దాడుల వల్ల ఇరాన్ అణు కార్యక్రమానికి ఎంత నష్టం వాటిల్లిందనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. అక్టోబర్‌లో వెలువడిన కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) నివేదిక ప్రకారం.. ఈ దాడులు ఇరాన్ అణ్వస్త్ర సామర్థ్యాన్ని ఎంతవరకు ప్రభావితం చేశాయో చెప్పడం కష్టమని పేర్కొంది. అంతేకాకుండా గతంలో చేసిన అంచనాల ప్రకారం, ఇరాన్ అసలు అణ్వస్త్రాలను నిర్మించడం లేదని కూడా ఆ నివేదిక గుర్తు చేసింది. మరోవైపు, తమ అణు కార్యక్రమం కేవలం శాంతియుత ప్రయోజనాల కోసమేనని, అణ్వస్త్రాలను అభివృద్ధి చేసే ఉద్దేశం తమకు లేదని ఇరాన్ మొదటి నుంచి స్పష్టం చేస్తోంది.

ప్రజాబలం యాత్రతో ప్రజల్లోకి వెళ్తా: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో రైతులు లాభాలు పొందుతున్నారని పేర్కొంటూ, గత ప్రభుత్వ విధానాలపై విమర్శలు గుప్పించారు.

పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు?

కరోనా సమయంలో క్రోసిన్ మాత్ర వేసుకోవాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారని, ఆయన మాటలు విన్నవారు ప్రాణాలు కోల్పోయారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఆశతో కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయినప్పటికీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టులు పూర్తయి ఉంటే పాలమూరు, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని అన్నారు.దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గోదావరి జలాలను ఈ ప్రాంతానికి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టి, ఇందుకోసం రూ.15 వేల కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును సరిదిద్దేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే బీఆర్ఎస్ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ వద్దకు వెళ్లి సీబీఐ విచారణను అడ్డుకున్నారని ఆరోపించారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రచారం చేసిన నేతలు ఇప్పుడు మేడిగడ్డ అంశం ప్రస్తావనకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఎన్నో ఇబ్బందులు ఎదురైనా గోదావరి జలాలను రైతులకు అందిస్తున్నామని తెలిపారు.

కొడంగల్‌కు గతంలో ఏం చేశారు?

కేసీఆర్ హయాంలో కొడంగల్ నియోజకవర్గానికి ఏం చేశారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో సరైన బడులు, గుడులు, రహదారులు కూడా లేవని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే కొడంగల్‌కు వచ్చి తనను ఓడించాలని ప్రచారం చేశారని, అభివృద్ధిని మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. టస్సర్ కార్మికులకు రావాల్సిన అభివృద్ధి నిధులను సిరిసిల్లకు తరలించారని అన్నారు. కొడంగల్ ఎత్తిపోతల పథకంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంటే వారికి ఎందుకంత అసూయ అని ప్రశ్నించారు.కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే తనకు ముఖ్యమంత్రి పదవి దక్కిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీ సమీపంలోని నోయిడా, ముంబై పక్కనున్న పుణె తరహాలో కొడంగల్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ ప్రాంతానికి అనేక ప్రాజెక్టులు తీసుకొస్తామని, విద్యా సదుపాయాలను విస్తరిస్తామని తెలిపారు. గతంలో ఇంటర్మీడియట్ చదవాలన్నా విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, భవిష్యత్తులో ఇతర ప్రాంతాల విద్యార్థులు కూడా చదువుకునేందుకు కొడంగల్‌కు వచ్చేలా విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఇక్కడ పండే కందులు, జొన్నలకు మరింత ప్రాధాన్యం రావాలంటే ప్రాంతం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని చెప్పారు.

రూ.9 వేల కోట్లతో అభివృద్ధి పనులు..

కొడంగల్‌ను ఇతర ప్రాంతాలు అసూయపడేలా దేశానికే ఆదర్శంగా నిలిపే విధంగా అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ ప్రాంతంలో రూ.9 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అందరికీ రేపు దీపావళి అయితే, కొడంగల్‌కు మాత్రం ఈ రోజే దీపావళి వెలుగులు వచ్చాయని వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి కేటీఆర్ ఎన్ని ప్రయత్నాలు చేసినా తన స్థాయికి చేరుకోలేరని అన్నారు. బీఆర్ఎస్ నేతలు చేసిన అవినీతిని ప్రజలు ఇంకా మరిచిపోలేదని, ఆ పార్టీని మళ్లీ నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు.

రైతులు నీటిని పొదుపుగా వినియోగించాలి..

తమ ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్నధాన్య పంటలను సాగు చేసిన రైతులకు ప్రస్తుతం రూ.4 వేల చొప్పున చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. వరి పంట వేస్తే నీటి అవసరం ఎక్కువగా ఉంటుందని, అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని చెప్పారు. జూలై వరకు వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్న నేపథ్యంలో రైతులు నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంపై అసెంబ్లీలో చర్చించాలని తమ ప్రభుత్వమే ముందుగా భావించిందని, ఈ అంశంపై చర్చకు అవకాశం కల్పించాలని స్పీకర్‌ను కోరినట్లు తెలిపారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

రావిర్యాలలో 22ఏ భూముల వ్యవహారంపై వివాదం

- **రూ.91 లక్షలకు రిజిస్ట్రేషన్.. ఆ తర్వాత భూమి విలువలో భారీ మార్పులు**
- **రెవెన్యూ అధికారుల తీరుపై బాధితుల అభ్యంతరాలు.. రాజకీయ ప్రమేయంపై అనుమానాలు**

రంగారెడ్డి జిల్లా, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామంలోని సర్వే నంబర్ 8 భూముల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములను తొలగించి రిజిస్ట్రేషన్లు చేయడం, అనంతరం మళ్లీ నిషేధిత జాబితాలో చేర్చడం, మార్కెట్ విలువలను పలుమార్లు మార్చడం వంటి పరిణామాలు రెవెన్యూ శాఖలో చర్చకు దారితీశాయి.

రికార్డుల్లో కనిపిస్తున్న వివరాలు:

సర్వే నంబర్ 8/5లోని 2.31 ఎకరాల భూమికి ఎకరాకు రూ.91 లక్షల మార్కెట్ విలువతో రిజిస్ట్రేషన్ జరిగినట్లు ప్రచురితమైన రికార్డుల వివరాలు వెల్లడిస్తున్నాయి. అనంతరం నవంబర్ 3న అదే భూమి మార్కెట్ విలువను ఎకరాకు రూ.35,29,81,500గా మార్చినట్లు, నవంబర్ 4న ఉదయం రూ.1,19,70,000కు, కొద్దిసేపటికే రూ.60,90,000కు సవరించినట్లు ఆంధ్రజ్యోతి కథనం పేర్కొంది. Cite refsR turn736983search

బాధితుల ఆరోపణలు:

సర్వే నంబర్ 8 పరిధిలోని 11.33 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి, ఒక్కొక్కరికి 2.31 ఎకరాల చొప్పున రిజిస్ట్రేషన్లు చేసి పాస్‌బుక్కులు జారీ చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. భూములపై కోర్టు వివాదాలు కొనసాగుతున్నప్పటికీ, తమకు సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేశారని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

బాధితుడు ఏమంటున్నారంటే..

సర్వే నంబర్ 8/అ పరిధిలో తన కుటుంబానికి వారసత్వంగా వచ్చిన 6 ఎకరాల 4 గుంటల భూమిని తనకు తెలియకుండానే ఇతరుల పేరిట మార్చేశారని చింతల మురళీధర్ రెడ్డి ఆరోపించారు. తమకు ఎలాంటి నోటీసులు అందలేదని ఆయన పేర్కొన్నట్లు వార్తా కథనం వెల్లడించింది.Cite refsR{[»»turn736983search0µµ]}

విచారణ జరగాల్సిన అంశాలు:



22ఏ నిషేధిత జాబితా నుంచి భూమిని తొలగించడానికి ఎవరు అనుమతించారు?

రిజిస్ట్రేషన్లకు ముందు కోర్టు కేసులు, న్యాయస్థాన ఉత్తర్వులను పరిశీలించారా?

భూహారతి పోర్టల్‌లో మార్కెట్ విలువను గంటల వ్యవధిలో పలుమార్లు ఎందుకు మార్చారు?

11.33 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్లు, పాస్‌బుక్కుల జారీకి సంబంధించిన అధికారిక అనుమతులు ఏమిటి?

ఈ వ్యవహారంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉందన్న ఆరోపణల్లో వాస్తవమెంత?

అధికారిక వివరణ రావాల్సి ఉంది:

ఈ వ్యవహారంపై సంబంధిత రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్ నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. రికార్డుల మార్పులకు సంబంధించిన అనుమతులు, ఫైల్ నోటింగులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, కోర్టు ఉత్తర్వులను పరిశీలించి సమగ్ర విచారణ చేపడితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం





- **నవంబర్ 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణకు అవకాశం**
- **ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు మరో అవకాశం : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**

సూర్యాపేట, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ూ×=–2026) ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులకు మరో అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. నవంబర్ 21వ తేదీ వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు.శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ూ×=–2026 ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన, ద్వంద్వ ఓటర్ల వివరాలపై సమీక్షించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తెలిపారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం, ద్వంద్వ ఓటింగ్ తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

అర్హులైన ఓటర్లకు విస్తృత అవగాహన కల్పించాలి

బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటి విచారణ చేపట్టి ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులను గుర్తించాలని సూచించారు. ఫారాలు అందని వారికి తిరిగి అందజేసేలా చర్యలు తీసుకోవాలని, ఫోన్ నంబర్లు, ఈ–మెయిల్ వివరాలు అనుసంధానమైన ఓటర్లకు వాట్సాప్, ఈ–మెయిల్ ద్వారా కూడా ఫారాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో జాబితాల ప్రదర్శన

గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన, ద్వంద్వ ఓటర్ల (ూణణ) వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాల రూపంలో ప్రదర్శించాలని ఆదేశించారు. ఆయా ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోవడానికి గల కారణాలను కూడా స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. ఈ వివరాలను పోలింగ్ కేంద్రాలతో పాటు ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఆన్‌లైన్‌లోనూ ఫారాల సమర్పణకు అవకాశం

ఓటర్లు తమ పాత ఎపిక్ నంబర్ ఆధారంగా ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఈసీఐనెట్ యాప్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని సమర్పించవచ్చని తెలిపారు. ఒకే చిరునామాలో నివసిస్తున్నప్పటికీ గతంలో ఫారం సమర్పించలేకపోయిన వారు అందుకు గల కారణాలను వివరిస్తూ డిక్లరేషన్ ఇవ్వాలని సూచించారు. చిరునామా మారిన వారు కొత్త చిరునామాకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని పేర్కొన్నారు.సమర్పించిన ఫారాలను సంబంధిత ఎన్నికల అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, ఎన్నికల సిబ్బంది రాజేందర్ రెడ్డి, భరత్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో 1.5 కిలోల గంజాయి పట్టివేత.. నలుగురి అరెస్ట్!

- **ఒడిశా నుంచి గంజాయి తెచ్చి విక్రయించేందుకు యత్నం!**
- **1,500 గ్రాముల గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్ట్, ఇద్దరు పరారీ**

సూర్యాపేట, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

సూర్యాపేట పట్టణంలో 1,500 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేసినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. మరో ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. పోలీసుల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై రామచంద్ర గౌడ్ సిబ్బందితో కలిసి చివ్వెంల రహదారిలోని అమ్మ గార్డెన్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులను గుర్తించిన ఇద్దరు వ్యక్తులు పరారయ్యారని, అక్కడికి గంజాయి తీసుకునేందుకు వచ్చిన మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో బొంత అవినాష్, సోమపంగు నాని వర్ధన్ ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చేందుకు వెళ్లినట్లు, అరెస్టయిన నలుగురు వారికి డబ్బులు సమకూర్చినట్లు వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు.అరెస్టయిన వారిని రూపాని సందీప్, బొడ్డు భరత్, పులుసు సాయి విశాల్ గౌడ్, శీలం శ్రీకాంత్ లింగయ్యగా గుర్తించారు. పరారీలో ఉన్న బొంత అవినాష్, సోమపంగు నాని వర్ధన్ కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు తెలిపారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. గంజాయి రవాణా, విక్రయం, కొనుగోలు, వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. ఈ కేసును ఛేదించిన ఎస్సై రామచంద్ర గౌడ్‌తో పాటు పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు.





యువత

కాలేజీ రోజులంటే
షికార్లకే కాదు...
స్వప్నాలకు రెక్కలు తొడిగే కాలం.
పుకార్ల వెంట పరుగెత్తకండి...
మద్యానికి, గంజాయికి
చెడు వ్యసనాలకు బానిసలై
మీ భవిష్యత్తును బూడిద చేయకండి.
అమ్మా... నాన్నా...
తమ రక్తాన్ని చెమట చుక్కలుగా మార్చి,
ఎండనకా... వాననకా...
కాయకష్టం చేస్తూ
మీ భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.
ముదుసలి వయసులో
మీ చేత నాలుగు మెతుకులు తినాలన్నది
వారి ఆశ కాదు...
"మేము పడిన కష్టాలు
మా పిల్లలు పడకూడదు"
అన్నదే వారి తాపత్రయం.
ప్రేమ పేరుతో
కాలాన్ని వృథా చేయకండి...
మీ కలలను కాలగర్భంలో కలపకండి.
పుస్తకాన్ని తోడుగా చేసుకోండి...
జ్ఞానాన్ని ఆయుధంగా మలచుకోండి...
ఉన్నత విద్యను అభ్యసించి
సమాజ మార్పుకు సారథులుగా ఎదగండి.
మహాత్మా జ్యోతిరావు ఫూలే చూపిన
సామాజిక చైతన్య మార్గంలో...
పెరియార్ రామస్వామి నాయకర్ నూరిపోసిన
ఆత్మగౌరవ బాటలో...
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన
విద్యా--సమానత్వ స్ఫూర్తితో
ముందుకు సాగండి.
మీ చేతుల్లోనే
రేపటి సమాజం ఉంది...
మీ అడుగుల్లోనే
భవిష్యత్తు దిశ ఉంది...
ఈ రోజే పునాది వేయండి...
ఉజ్వల భవిష్యత్తుకు
మీ జీవితాన్నే ఒక విజయగాథగా
మలచండి.



వేకువ
తాళ్లపెల్లి సురేందర్

గురుకులంలో ర్యాగింగ్ కలకలం..

పెద్దపల్లి, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల మధ్య జరిగిన వివాదం దాడికి దారితీసింది. పదో తరగతి చదువుతున్న విద్యార్థిపై నలుగురు తోటి విద్యార్థులు దాడి చేయడం కలకలం రేపింది. బ్లూంకెట్ విషయంలో మొదలైన వివాదం క్రమంగా తీవ్ర ఘర్షణకు దారితీసినట్లు సమాచారం. ఈ క్రమంలో నలుగురు విద్యార్థులు కలిసి బాధితుడి ముఖం, వీపుపై పిడిగుద్దులతో దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో విద్యార్థికి గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన పాఠశాల ప్రిన్సిపాల్ బాధితుడికి ప్రథమ చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న బాధిత విద్యార్థి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఎస్సై ఎంబడి శ్రీకాంత్ ఘటనపై స్పందించి, దాడికి పాల్పడిన నలుగురు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. విద్యార్థుల మధ్య చిన్నపాటి వివాదాలు దాడుల వరకు వెళ్లడం, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, పర్యవేక్షణపై ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవంపై ప్రత్యేక కార్యక్రమం

- **క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చు**
- **ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలి.. 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్‌పీవీ టీకా వేయించాలి: డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణ**

సూర్యాపేట, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపుపై అవగాహన కల్పించేందుకు జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మోతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకట రమణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. పొగాకు వినియోగం, ధూమపానం, మద్యపానం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం క్యాన్సర్‌కు ప్రమాద కారకాలన్నారు. ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని పొగాకు, మద్యపానానికి దూరంగా ఉండాలని సూచించారు.నోటిలో పుండ్లు తగ్గకపోవడం, రొమ్ములో గడ్డలు, అసాధారణ రక్తస్రావం, కారణం తెలియకుండా బరువు తగ్గడం, దీర్ఘకాలిక దగ్గు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు 14 ఏళ్లు నిండిన ప్రతి బాలికకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాలని



సూచించారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు, పరీక్షలు, చికిత్సపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి. చంద్రశేఖర్, వైద్యాధికారులు డాక్టర్ భవాని, డాక్టర్ శ్రీనివాస రాజు, డిప్యూటీ డెమో వి. సంజీవ్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

33 ఫార్మా కంపెనీల కాలుష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు

- **కాలుష్య నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలి.. గోసుకొండ వెంకటేష్ డిమాండ్**

చౌటుప్పల్, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):



యాదాద్రి–భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 33 ఫార్మా, కెమికల్ కంపెనీల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజల ఆరోగ్యం, పంటలు, భూగర్భ జలాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ ఉపాధ్యక్షుడు గోసుకొండ వెంకటేష్ ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య సమస్యపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.శనివారం చౌటుప్పల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో 33 ఫార్మా కంపెనీలకు అనుమతులు ఇచ్చినా, కాలుష్య నియంత్రణపై తగిన పర్యవేక్షణ లేదని విమర్శించారు. రాత్రి వేళల్లో రసాయన వ్యర్థాలు విడుదలవుతున్నాయని, దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.చౌటుప్పల్, దండు మల్కాపురం, తాళ్ల సింగారం, దేవలమ్మ నాగారం గ్రామాల్లో బోర్ల నీరు రంగు మారి, దుర్వాసన వస్తోందని, రసాయన కాలుష్యంతో రైతుల వరి, పత్తి పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. చిన్నారులు శ్వాసకోశ, చర్మ సమస్యలతో బాధపడుతున్నారని, వృద్ధులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కాలుష్య నియంత్రణ మండలి 33 కంపెనీలపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన సంస్థల లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కంపెనీలో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (ZLD) విధానం అమలు చేయాలని, ప్రభావిత గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు, స్వచ్ఛమైన తాగునీటి సదుపాయాలు కల్పించాలని కోరారు. చౌటుప్పల్ పరిధిలో కొత్త ఫార్మా కంపెనీలకు అనుమతులు ఇవ్వకూడదని, కాలుష్యంతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు వినతిపత్రం అందజేస్తామని, సమస్య పరిష్కారం కాకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గోసుకొండ వెంకటేష్ హెచ్చరించారు.

పాకాల సరస్సులో విషాదం.. తల్లి, ఇద్దరు పిల్లలు మృతి

ఖానాపురం, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ జిల్లాలోని ఖానాపురం మండల పరిధిలో ఉన్న పాకాల సరస్సులో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు పిల్లలతో కలిసి సరస్సులో మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలు సేకరిస్తూ విచారణ చేపట్టారు. తల్లి ఇద్దరు పిల్లలతో కలిసి సరస్సులోకి ఎందుకు వెళ్లాల్సి వచ్చింది? ఘటనకు గల కారణాలేమిటి? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మృతుల వివరాలు, ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

షార్ట్ సర్క్యూట్‌తో టాటా ఏస్ వాహనం దగ్ధం.. తృటిలో తప్పిన పెను ప్రమాదం

ఆసిఫాబాద్, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని 363వ జాతీయ రహదారిపై శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బూరుగుడా బీఈడీ కళాశాల సమీపంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా టాటా ఏస్ ప్యాసింజర్ వాహనం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది.TS 1 EB 6667 రిజిస్ట్రేషన్ నంబర్ గల ఈ వాహనం పర్సనాంబల గెడేకర్ రవీందర్‌కు చెందినది. వాహనం ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగినట్లు సమాచారం. క్షణాల్లోనే మంటలు వాహనం అంతటా వ్యాపించడంతో వాహనంలోని ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అయితే వాహనంలో మంటలు చెలరేగడాన్ని ముందుగానే గుర్తించిన ప్రయాణికులు అప్రమత్తమై వెంటనే కిందకు దిగిపోయారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంటల తీవ్రతకు వాహనం పూర్తిగా కాలిపోయి తీవ్ర ఆస్తినష్టం సంభవించింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ ఘటనతో కొద్దిసేపు స్థానికంగా ఆందోళన నెలకొంది.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి.. క్రీడల వైపు అడుగులు వేయాలి

నల్గొండ, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

విద్యార్థులు సెల్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.నల్గొండలోని మేకల అభినవ్ స్టేడియంలో కలెక్టర్ ఎలెవన్, ఎస్పీ ఎలెవన్ జట్ల మధ్య నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను వీక్షించారు. ఉత్సాహభరితంగా సాగిన ఈ పోటీలో ఎస్పీ ఎలెవన్ జట్టు 118 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో విద్యార్థులు ఎక్కువ సమయం సెల్‌ఫోన్లకే కేటాయిస్తున్నారని, దానికి బదులుగా ఆటలు, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు అధికారుల మధ్య స్నేహభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.అనంతరం ఎస్బీఐ సీఎస్ఆర్ నిధులు రూ.1.80 లక్షలతో ఏర్పాటు చేసిన రివర్స్ ఆస్మాసిస్ (ఆర్.ఓ.) నీటి శుద్ధి ప్లాంట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా అందుబాటులోకి వచ్చిన శుద్ధి తాగునీటి సదుపాయం ప్రజలకు ఉపయోగపడుతుందని తెలిపారు.



కాలుష్యరహిత దీపావళిపై విద్యార్థులకు అవగాహన

- **ఏకేవీఆర్ కళాశాలలో ఘనంగా గ్రీన్ దీపావళి వేడుకలు**

ముల్కనూర్, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా, కాలుష్యరహిత దీపావళి వేడుకల ఆవశ్యకతను చాటుతూ ముల్కనూర్‌లోని ఏకేవీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో గ్రీన్ దీపావళి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు బాణసంచా కాల్చడం వల్ల కలిగే వాయు, శబ్ద కాలుష్యాలపై అవగాహన కల్పించారు. పర్యావరణానికి హాని కలిగించని విధంగా దీపాలు వెలిగిస్తూ, ప్రకృతిని కాపాడుతూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్ మాట్లాడుతూ.. దీపావళి వెలుగులకు, ఆనందానికి ప్రతీక అని, పండుగ సంబరాల పేరుతో పర్యావరణానికి హాని కలిగించడం సరికాదన్నారు. ప్రతి



ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ కాలుష్యరహిత దీపావళిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రీన్ దీపావళి నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తొర్రూరులో రూ.80 లక్షల సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన!



మహబూబాబాద్, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణంలో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌లో మూడు ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

ఆసిఫాబాద్, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):



పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 15వ వార్డు కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా బిన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సీఐ నీలం రవి సంయుక్తంగా ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించారు.దస్నాపూర్--కోర్టు రోడ్డు జంక్షన్, బెజ్జూర్ సూపర్ మార్కెట్ ఎదుట, కలెక్టరేట్ రోడ్డులోని చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వరి నారుమడి యాజమాన్యంపై రైతులకు అవగాహన.. సాగు పద్ధతులపై విద్యార్థుల ప్రదర్శన

కీతవారిగూడెం, నవంబర్ 7, (ప్రజానేస్తం జ్వాల):

గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలో రైతులకు వరి నారుమడి యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏలూరులోని సీహెచ్ఎస్‌డీ సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ చివరి సంవత్సరం విద్యార్థులు గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాణ్యమైన, ఆరోగ్యవంతమైన నారును పెంచుకోవడం ద్వారా వరి పంటలో మంచి దిగుబడులు సాధించవచ్చని విద్యార్థులు రైతులకు వివరించారు. నారుమడి తయారీకి అనువైన భూమి ఎంపిక, నేలను దున్ని చదును చేయడం, నారుమడి సిద్ధం చేయడం, నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సరైన మోతాదులో విత్తనాలు చల్లే విధానాలను ప్రదర్శన ద్వారా వివరించారు.



జపనీస్, జర్మన్ సహా నాలుగు విదేశీ భాషల్లో ఉచిత శిక్షణ

- **మైనారిటీ అభ్యర్థులకు అవకాశం.. నవంబర్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలి**

సూర్యాపేట, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

మైనారిటీ వర్గాల యువతకు విదేశీ భాషల్లో నైపుణ్యం పెంపొందించి మెరుగైన విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ మైనారిటీల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత ఫౌండేషన్ కోర్సులు నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి విశాల్ ధార తెలిపారు.హైదరాబాద్‌లోని తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో జపనీస్, జర్మన్, ఫ్రెంచ్, కొరియన్ భాషల్లో 45 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన, పార్సీ, బౌద్ధ మైనారిటీ వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ కోర్సులకు అర్హులని తెలిపారు.ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 10 చివరి తేదీ కాగా, అదే రోజు తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ విద్యా ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హైదరాబాద్‌లోని



తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్, ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రాంగణం, ఎంఏఎం క్యాంపస్, గోషామహల్, నాంపల్లి చిరునామాలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.మరిన్ని వివరాలకు 040-23236112, 9059050062 నంబర్లను సంప్రదించాలని, లేదా directormsccctelangana@gmail.comకు మెయిల్ చేయాలని తెలిపారు. విదేశీ భాషలపై ఆసక్తి ఉన్న మైనారిటీ యువత ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విశాల్ ధార కోరారు.

ఈ నెల 28న నవోదయ ప్రవేశ పరీక్ష.. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి!

- **వివరాల సవరణకు పరిమిత అవకాశం.. పుట్టిన తేదీ, పరీక్షా మాధ్యమంలో మార్పులకు అనుమతి లేదు**

సూర్యాపేట, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

2027-28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష (JNVST) ఈ నెల 28న (శనివారం) జరగనుందని సూర్యాపేట జిల్లా జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ తెలిపారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెంటనే తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో సమయానికి హాజరుకావాలని సూచించారు.అభ్యర్థుల దరఖాస్తుల్లో కేటగిరీ, లింగం, దివ్యాంగత్వం, గ్రామీణ లేదా పట్టణ ప్రాంతానికి సంబంధించిన వివరాల్లో తప్పులు ఉంటే సవరణకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఇందుకోసం సంబంధిత ఆధారాలు, డిక్లరేషన్‌తో పరీక్షా కేంద్రంలోని ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ సవరణలు హాజరు పత్రంలో మాత్రమే చేసుకునేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.అయితే అభ్యర్థుల పుట్టిన తేదీ, పరీక్షా మాధ్యమం, బ్లాక్ వివరాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ మార్పులకు అనుమతి లేదని వెల్లడించారు.విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సూచనలను గమనించి పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, నిర్దేశిత తేదీన తప్పనిసరిగా పరీక్షకు హాజరయ్యేలా చూడాలని ప్రిన్సిపాల్ కోరారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఓటు హక్కు కోల్పోయిన వారికి మరో అవకాశం.. జిల్లాలో 96,307 మంది!

● ఏఎస్‌డీడీ జాబితాలో పేర్లున్న అర్హులు ఈ నెల 21లోగా దరఖాస్తులు సమర్పించాలి.. కలెక్టర్

సూర్యాపేట, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR-2026)లో భాగంగా వివిధ కారణాలతో ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు కోల్పోయిన అర్హులకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. సూర్యాపేట జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏఎస్‌డీడీ (ASDD) జాబితాలో 96,307 మంది ఉన్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి రాకపోవడం, గైర్హాజరు, చిరునామా మార్పు, మరణంగా నమోదు కావడం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి కారణాలతో ముసాయిదా జాబితాలో పేర్లు లేని వారు ఈ ప్రక్రియ ద్వారా తిరిగి తమ ఓటు హక్కును పొందవచ్చని తెలిపారు.నియోజకవర్గాల వారీగా హుజూర్‌నగర్‌లో 22,506, కోదాడలో 26,296, సూర్యాపేటలో 26,097, తుంగతుర్తిలో 21,408 మంది చొప్పున మొత్తం 96,307 మంది ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్నారు. ఫారం-6 అవసరం లేదు ఏఎస్‌డీడీ జాబితాలో పేర్లున్న వారు కొత్తగా ఫారం-6 దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్యూమరేషన్ ఫారం (Annexure-A) పూర్తి చేసి సంబంధిత అధికారులకు సమర్పిస్తే సరిపోతుందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (BLO\T) ఇంటింటికీ వచ్చి ఫారాలు అందజేస్తారని, ఈసీఐ వెబ్‌సైట్ లేదా ECINET యాప్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని పేర్కొన్నారు.నివాసం మారని వారు Annexure-B, రాష్ట్రంలోనే చిరునామా మార్చిన వారు కొత్త చిరునామా ధ్రువీకరణ పత్రంతో Annexure-C సమర్పించాలని సూచించారు. ఈ నెల 21లోగా గడువు ఏఎస్‌డీడీ జాబితాలను సంబంధిత



పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపల్ కార్యాలయాలతో పాటు జిల్లా, సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 21లోగా ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నందున అర్హులైన ఓటర్లు ఆలస్యం చేయకుండా ఫారాలు సమర్పించాలని కోరారు. ఇప్పటికే మరో ప్రాంతంలో ఓటు హక్కు కలిగిన వారు రెండో చోట నమోదు చేసుకునేందుకు తప్పుడు వివరాలు ఇస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం-1950 ప్రకారం చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించాలని లేదా ECINET యాప్‌లోని Book a Call with BLO సేవను వినియోగించుకోవాలని సూచించారు. అర్హులైన ఒక్కరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదనే లక్ష్యంతో కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు

బాలల అభిప్రాయాలకు ప్రాధాన్యం.. చైల్డ్ ఫ్రెండ్లీ జిల్లాగా సూర్యాపేట

● 'లిజనింగ్ టు చిల్డ్రన్' కార్యక్రమంలో 100 పాఠశాలలు, 6 వేల మంది విద్యార్థుల భాగస్వామ్యం

సూర్యాపేట, నవంబర్ 7, (ప్రజానేస్తం జ్వాల):



సూర్యాపేట జిల్లాను బాలల స్నేహపూర్వక (చైల్డ్ ఫ్రెండ్లీ) జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం మరో ముందడుగు వేసింది. యూనిసెఫ్ (UNICEF) సహకారంతో చేపట్టిన 'లిజనింగ్ టు చిల్డ్రన్' (LTC) కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ,



సమగ్ర శిక్ష, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన సుమారు 100 జిల్లా పరిషత్, ప్రభుత్వ, గురుకుల, ప్రైవేట్ పాఠశాలల్లో 6 వేల మంది విద్యార్థులు గ్రూప్ డిస్కషన్లలో పాల్గొన్నారు. తమ అభిప్రాయాలు, ఆలోచనలు, అభిరుచులు, భవిష్యత్తు ఆశయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచారు.

మిల్లర్ల సిండికేట్‌పై చర్యలు తీసుకోవాలి

● రైతుల ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించాలి: తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున రెడ్డి

సూర్యాపేట, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

జిల్లాలో రైస్ మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి రైతుల నుంచి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కంటే తక్కువ ధరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున రెడ్డి ఆరోపించారు. మిల్లర్ల అక్రమ కొనుగోళ్లపై సమగ్ర విచారణ జరిపి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రైతు సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ హరిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మల్లు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొస్తున్న రైతులను కొందరు రైస్ మిల్లర్లు కుమ్మక్కై సిండికేట్‌గా ఏర్పడి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. దీంతో రైతులు పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు తగిన ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. తూకం, తేమ



శాతం పేరుతో రైతులకు అన్యాయం జరగకుండా పర్యవేక్షణ పెంచాలని, అక్రమ తరుగు, కోతలకు అడ్డుకట్ట వేసి పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా ప్రత్యేక అధికారులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ రైతులను దోపిడీ చేసే మిల్లులపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టపాసుల విక్రయ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

హుజూర్‌నగర్, నవంబర్ 7 (ప్రజా నేస్తం జ్వాల):

దీపావళి పండుగ సందర్భంగా టపాసుల విక్రయ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విక్రయదారులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని హుజూర్‌నగర్ ఎస్ఐ నరేశ్ సూచించారు. ఈ మేరకు పట్టణంలోని టపాసుల విక్రయదారులతో సమావేశం నిర్వహించి పలు భద్రతా సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తాత్కాలిక లైసెన్సులు పొందిన వ్యాపారులు మాత్రమే నిబంధనలకు అనుగుణంగా టపాసుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. స్టాళ్ల వద్ద అగ్నిప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. టపాసుల విక్రయాల సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులు లేదా అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా వ్యాపారులు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ నరేశ్ కోరారు.



ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు దిశానిర్దేశం

రావెప్ విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన

భీమదేవరపల్లి, నవంబర్ 7, (ప్రజానేస్తం జ్వాల):



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న వరంగల్ వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమం (RAWEP)లో భాగంగా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని హనుమకొండ, జనగామ, ములుగు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రాల కోఆర్డినేటర్లు డాక్టర్ ఈ. నరసయ్య, డాక్టర్ విశ్వతేజ, డాక్టర్ పి. లక్ష్మణ్ పర్యవేక్షించారు. హనుమకొండ, వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. సదస్సులో విద్యార్థులు ఆధునిక వ్యవసాయ నమూనాలు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేశారు. అధునాతన సాగు పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, సమగ్ర తెగుళ్ల నివారణ (IPM), సమతుల్య ఎరువుల వినియోగం, నీటి సంరక్షణ, బిందు సేద్యం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

● హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో రూ.6 కోట్ల ఖర్చుపై సమగ్ర విచారణ చేపట్టాలి: బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్

హుజూర్‌నగర్, నవంబర్ 7, (ప్రజానేస్తం జ్వాల):



హుజూర్‌నగర్ పట్టణంలోని 281 సర్వే నంబర్‌లో అక్రమ రిజిస్ట్రేషన్లకు సహకరించేలా నిబంధనలకు విరుద్ధంగా ఎన్ఓసీలు జారీ చేసిన మున్సిపల్ కమిషనర్‌పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు శనివారం ఆయన ఆధ్వర్యంలో బీజేపీ పట్టణ నాయకులు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎన్ఓసీలు జారీ చేసి అక్రమ రిజిస్ట్రేషన్లకు సహకరించిన అధికారుల బాధ్యతను నిర్ధారించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో అధికారిక తీర్మానాలు లేకుండా, జనరల్ బాడీ సమావేశాల ఆమోదం పొందకుండానే సుమారు రూ.6 కోట్ల ప్రజాధనం ఖర్చు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులు, బిల్లులు, పనుల వివరాలను పరిశీలించి, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యుల నుంచి ప్రజాధనాన్ని రికవరీ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

జన సురక్ష పథకాలపై అవగాహన.. లట్టుపల్లిలో ప్రత్యేక క్యాంపు

లట్టుపల్లి, నవంబర్ 8, (ప్రజానేస్తం జ్వాల):



నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం లట్టుపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం (CFL) ఆధ్వర్యంలో జన సురక్ష సాచురేషన్ క్యాంపు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన మంగనూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. బ్యాంకు ఖాతాదారులందరూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (PMSBY), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY) వంటి బీమా పథకాల్లో చేరాలని సూచించారు. అలాగే బ్యాంకు ఖాతాలకు సంబంధించిన కేవైసీ, రీ-కేవైసీ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీలు, రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని హెచ్చరించారు. పంట రుణాలు తీసుకున్న ఖాతాదారులు సకాలంలో రుణాలను రెన్యువల్ చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం అందించే 3 శాతం వడ్డీ రాయితీని పొందవచ్చని వివరించారు. బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ పథకాల ద్వారా లభించే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

యాదవ సంఘం నాయకులకు డా. నైనా జైస్వాల్ ప్రత్యేక అభినందనలు

హుజూర్‌నగర్, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

హుజూర్‌నగర్ మున్సిపాలిటీ కౌన్సిలర్, హుజూర్‌నగర్ నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు జక్కుల మల్లయ్య యాదవ్ నివాసానికి ప్రముఖ క్రీడాకారిణి డా. నైనా జైస్వాల్ ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జక్కుల మల్లయ్య యాదవ్‌తో పాటు యాదవ సంఘం నాయకులను ఆమె అభినందించారు. నవంబర్ 4వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ పక్కన ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో మాజీ పార్లమెంటు సభ్యుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మందని అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాదవ సమ్మేళనానికి హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి జక్కుల మల్లయ్య యాదవ్‌తో పాటు పెద్ద సంఖ్యలో యాదవ సంఘం నాయకులు హాజరయ్యారు. ఈ సమ్మేళనంలో యాదవ సంఘం నాయకులు చురుకుగా పాల్గొన్న నేపథ్యంలో ఏకేవై (AKY) టీమ్ తరపున డా. నైనా జైస్వాల్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆమెకు స్వాగతం పలికారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఆసిఫాబాద్ జిల్లాలో 48,139 మంది ఏఎస్ఓడీ ఓటర్లు

ఆసిఫాబాద్, నవంబర్ 07 (ప్రజానేస్తం జ్వాల):



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఏఎస్ఓడీ జాబితాలో చోటు పొందిన ఓటర్లకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు.శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయడంతో పాటు, ఓటర్ల వివరాలను సేకరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లాలో 48,139 మంది ఓటర్లు ఏఎస్ఓడీ జాబితాలో ఉన్నట్లు కలెక్టర్ హరిత వెల్లడించారు. జాబితాలో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పీఎంశ్రీ నిధులను పారదర్శకంగా ఖర్చు చేయాలి

ఆసిఫాబాద్, నవంబర్ 07 (ప్రజానేస్తం జ్వాల):



పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో నాణ్యమైన మౌలిక వసతులు కల్పించాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లో ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పీఎం శ్రీ పథకం కింద జిల్లాలో ఎంపికైన 18 పాఠశాలల్లో కేటాయించిన నిధులను పారదర్శకంగా ఖర్చు చేయాలని సూచించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా అదనపు తరగతి గదులు నిర్మించడంతో పాటు కంప్యూటర్ విద్య, యోగా, కరాటే శిక్షణ అందించాలని తెలిపారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని, ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు విజ్ఞాన, పారిశ్రామిక యాత్రలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఉద్యోగాల పేరుతో దళారులను నమ్మి మోసపోవద్దు: ఆసిఫాబాద్ కలెక్టర్

ఆసిఫాబాద్, నవంబర్ 07 (ప్రజానేస్తం జ్వాల):



ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసే దళారులు, మధ్యవర్తులను నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత సూచించారు.జిల్లాలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతలు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం అర్హత ఆధారంగానే ఎంపిక చేపడతామని స్పష్టం చేశారు.ఉద్యోగాల భర్తీలో ఎలాంటి అక్రమాలకు, అవకతవకలకు తావు లేదని పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే అలాంటి వ్యక్తులను నమ్మవద్దని, నియామక ప్రక్రియపై సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను నేరుగా సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

రైతుల రుణాల రీషెడ్యూల్‌కు కలెక్టర్ ఆదేశం

ఆసిఫాబాద్, నవంబర్ 07 (ప్రజానేస్తం జ్వాల):



ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాలోని ఐదు మండలాల రైతులకు ఖరీఫ్ సీజన్‌లో మంజూరు చేసిన బ్యాంకు రుణాలను రీషెడ్యూల్ చేయాలని జిల్లా కలెక్టర్ హరిత బ్యాంకర్లను ఆదేశించారు.శనివారం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తక్కువ వర్షపాతం కారణంగా పంటల సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు రుణాల రీషెడ్యూల్ ద్వారా ఉపశమనం కల్పించాలని సూచించారు.రుణాలు పొందిన రైతుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు అందజేసి, రీషెడ్యూల్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంట రుణాలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన రుణాలను కూడా నిబంధనల ప్రకారం పునర్వ్యవస్థీకరించాలని కలెక్టర్ సూచించారు.

హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో బాలింత మృతి

హనుమకొండ, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో విషాద ఘటన చోటుచేసుకుంది. స్టేషన్ ఘన్‌పూర్ మండలం పాంనూరు గ్రామానికి చెందిన పొన్న రమ్య అనే బాలింత ప్రసవం అనంతరం మృతి చెందింది. శిశువుకు జన్మనిచ్చిన రెండు గంటలకే తీవ్ర రక్తస్రావం కావడంతో తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.అత్యవసర పరిస్థితుల్లో వైద్యులు సకాలంలో అందుబాటులో లేకపోవడం, సరైన సమయంలో వైద్య సేవలు అందకపోవడమే రమ్య మృతికి కారణమని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అయితే ఈ ఆరోపణలపై ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ మంజుల స్పందిస్తూ.. రమ్య గత కొంతకాలంగా ఎస్ఎల్ఈ (SLE), లూపస్ నెఫ్రైటిస్ వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఆమె ఆరోగ్య పరిస్థితి సంక్లిష్టంగా ఉన్నప్పటికీ మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య బృందం ప్రయత్నించిందని, అయినప్పటికీ ఆమె ప్రాణాలను కాపాడలేకపోయామని వివరించారు.బాలింత మృతితో పాంనూరు గ్రామంలో విషాదం నెలకొంది. ఒకవైపు కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యంపై ఆరోపణలు చేస్తుండగా, మరోవైపు ఆసుపత్రి అధికారులు ఆమెకు ఉన్న దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను ప్రస్తావిస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

ముల్కనూర్‌లో అంబరాన్నంటిన సదర్ సంబరాలు..

- **తొలిసారిగా నిర్వహించిన సదర్ మహోత్సవానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు**
- **దున్నపోతుల విన్యాసాలు, యాదవ సంప్రదాయ ప్రదర్శనలతో కోలాహలంగా వేడుకలు**

భీమదేవరపల్లి, నవంబర్ 7 (ప్రజా నేస్తం జ్వాల):



భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో తొలిసారిగా నిర్వహించిన సదర్ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే సదర్ వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ మహోత్సవానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరుకావడంతో వేడుకలకు మరింత ప్రత్యేకత సంతరించుకుంది. మంత్రి రాక సందర్భంగా యాదవ సంఘం నాయకులు, నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.ముల్కనూర్ గ్రామ చరిత్రలో తొలిసారిగా సదర్ మహోత్సవాన్ని నిర్వహించడంతో గ్రామస్తులు, యాదవ సంఘం ప్రతినిధులు ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. మంత్రికి స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ నాయకులు, యాదవ సంఘం ప్రతినిధులు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సదర్ వేడుకల ప్రాంగణం జనసందోహంతో కిక్కిరిసిపోయింది. సంప్రదాయబద్ధంగా అలంకరించిన దున్నపోతులు, వాటి ప్రత్యేక విన్యాసాలు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దున్నపోతుల ప్రదర్శనలను



చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు. వాటి విన్యాసాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.సదర్ పండుగ యాదవ సమాజం ఐక్యతకు, సంప్రదాయ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు సామాజిక ఐక్యతను చాటిచెప్పేలా ఇలాంటి వేడుకలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. గ్రామంలో తొలిసారిగా నిర్వహించిన ఈ మహోత్సవానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకావడం యాదవ సంఘం నాయకులు, నిర్వాహకుల్లో ఉత్సాహాన్ని నింపింది.ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఉప సర్పంచ్ మమతా బాలకృష్ణ, యాదవ సంఘం భీమదేవరపల్లి నాయకులు, సీనియర్ నాయకులు ఉసకోల ప్రకాష్, కొలుగూరి రాజు, ఆధరి రవీందర్, మంగ రామచంద్రం, మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కేతిరి లక్ష్మారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యాదవ సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సహోద్యోగి వైద్య ఖర్చుల కోసం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత

సూర్యాపేట, నవంబర్ 07 (ప్రజానేస్తం జ్వాల):



విధి నిర్వహణలోనే కాకుండా సహోద్యోగుల కష్టసుఖాల్లోనూ అండగా నిలుస్తూ సూర్యాపేట జిల్లా పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న హోంగార్డు బాలకృష్ణ కుటుంబానికి జిల్లా పోలీసు సిబ్బంది సమిష్టిగా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు.చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ ఇటీవల అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. దీంతో ఆయనను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గ్లెనీగిల్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పోలీసు సిబ్బంది, సహోద్యోగి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు.జిల్లా ఎస్పీ నరసింహ పిలుపు మేరకు పోలీసు సిబ్బంది స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.లక్ష సమకూర్చారు. ఈ మొత్తాన్ని చివ్వెంల ఎస్సై మహేశ్వర్ ద్వారా బాలకృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు.సహోద్యోగి కష్టాల్లో ఉన్నప్పుడు ఒక కుటుంబంలా అండగా నిలవడం పోలీసు శాఖలోని ఐక్యత, మానవత్వానికి నిదర్శనమని ఎస్పీ నరసింహ, పోలీసు అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సూర్యాపేట బిడ్డకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం

డాక్టర్ ఆనందరావుకు బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు

ఈ నెల 15న న్యూఢిల్లీలో పురస్కారం ప్రదానం.. పదేళ్లుగా వైద్య, సామాజిక సేవా రంగాల్లో విశేష కృషికి గుర్తింపు

సూర్యాపేట, నవంబర్ 7 (ప్రజా నేస్తం జ్వాల):



వైద్యం కేవలం వృత్తి మాత్రమే కాదని, సేవాభావంతో పనిచేసినప్పుడే సమాజానికి నిజమైన మేలు చేయగలమని నిరూపిస్తున్నారు ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఆనందరావు. వైద్య సేవలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతను గుర్తించి గత పదేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తనదైన గుర్తింపు పొందుతున్నారు. ఆయన చేస్తున్న నిరంతర సేవలను గుర్తించిన జాతీయ స్థాయి సంస్థ 'బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు'కు ఎంపిక చేసింది. ఈ గుర్తింపు సూర్యాపేట జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.వైద్యుడిగా ప్రజలకు సేవలు అందించడంతో పాటు విద్యా, సామాజిక రంగాల్లోనూ తన వంతు బాధ్యత నిర్వర్తించాలన్న సంకల్పంతో డాక్టర్ ఆనందరావు ముందుకు సాగుతున్నారు. సమాజంలో విద్యావంతులు సామాజిక చైతన్యంతో వ్యవహరిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన విశ్వసిస్తారు. ఈ ఆలోచనలకు అనుగుణంగా గత పదేళ్లుగా కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలు ఆయనకు జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకొచ్చాయి.తనకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించిన విషయాన్ని డాక్టర్ ఆనందరావు స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. తన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినందుకు భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుతూ భావోద్వేగంతో స్పందించారు.ఈ నెల 15వ తేదీన న్యూఢిల్లీలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ ఆనందరావుకు ఈ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. వైద్య సేవలతో పాటు సామాజిక, విద్యా రంగాల్లో ఆయన చేస్తున్న కృషికి లభించిన ఈ గుర్తింపుపై సూర్యాపేట జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, వైద్యులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ప్రారంభమైన సేవా ప్రయాణం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఇతరులకు, ముఖ్యంగా యువతకు స్ఫూర్తిదాయకమని అభినందిస్తున్నారు.

దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకుందాం -- 108

టపాసులు కాల్చేటప్పుడు అప్రమత్తత అవసరం.. ప్రమాదాలు జరిగితే వెంటనే 108కు కాల్ చేయాలి

EMRI GHS స్టేట్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ బి. సుధాకర్

సూర్యాపేట, నవంబర్ 8 (ప్రజా నేస్తం జ్వాల):

దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య సురక్షితంగా జరుపుకోవాలని జువీ=× గ్రీన్ హెల్త్ సర్వీసెస్ (EMRI GHS) 108 అత్యవసర సేవల స్టేట్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ బి. సుధాకర్ సూచించారు. పండుగ వేళ బాణసంచా కాల్చే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా అగ్నిప్రమాదాలు, కాలిన గాయాలు, ఇతర ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ తమతో పాటు కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.దీపావళి దేశవ్యాప్తంగా ఆనందోత్సాహాలతో జరుపుకునే దీపాల పండుగ అని, అయితే ఈ సందర్భంగా బాణసంచా వినియోగంలో అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు, పెద్దలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిర్లక్ష్యం కారణంగా సంభవించే ప్రమాదాలను తగిన జాగ్రత్తలతో నివారించవచ్చని తెలిపారు.

టపాసులు కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

బాణసంచాను ఇళ్లకు, వాహనాలకు, విద్యుత్ తీగలకు, మండే స్వభావం కలిగిన వస్తువులకు దూరంగా ఉన్న బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే కాల్చాలి. టపాసులు కాల్చే సమయంలో సింథటిక్ దుస్తులకు బదులుగా శరీరాన్ని పూర్తిగా కప్పే కాటన్ దుస్తులు ధరించాలి. టపాసులు పేల్చేటప్పుడు తగినంత దూరం పాటించాలి. ప్రమాదవశాత్తు పేలకుండా మిగిలిపోయిన టపాసులను వెంటనే తాకకూడదు. వాటిని తిరిగి వెలిగించే ప్రయత్నం చేయకూడదు. బాణసంచా కాల్చే ప్రదేశంలో ముందస్తుగా నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

కాలిన గాయాలైతే తక్షణ ప్రథమ చికిత్స:

బాణసంచా కారణంగా కాలిన గాయాలు సంభవించినప్పుడు బాధిత ప్రాంతంపై వెంటనే చల్లటి ప్రవహించే నీటిని సుమారు 20 నిమిషాల పాటు పోయాలి. కాలిన గాయాలపై నూనె, క్రీములు, ఇతర పదార్థాలు రాయకూడదు. చర్మానికి అతుక్కున్న దుస్తులను బలవంతంగా తొలగించకూడదు. కాలిన ప్రాంతాన్ని శుభ్రమైన, అంటుకోని వస్త్రంతో వదులుగా కప్పి వెంటనే వైద్య సహాయం పొందాలి. బాధితుడికి స్వయంగా చికిత్స చేసుకునే ప్రయత్నం చేయకుండా వైద్యుల సూచనలు పాటించాలని తెలిపారు.

24 గంటలు అందుబాటులో 108 సేవలు:

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 108 అంబులెన్స్‌లు 24 గంటల పాటు అందుబాటులో ఉన్నాయని బి. సుధాకర్ వెల్లడించారు. అగ్నిప్రమాదాలు, కాలిన గాయాలు లేదా ఇతర అత్యవసర వైద్య పరిస్థితులు ఎదురైనప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 108 నంబర్‌కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందిన వెంటనే బాధితులకు అత్యవసర వైద్య సహాయం అందించేందుకు 108 సిబ్బంది సిద్ధంగా ఉంటారని తెలిపారు.ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అనవసర ప్రమాదాలకు దూరంగా ఉండాలని, పిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మన భద్రత మన చేతుల్లోనే ఉందని, చిన్నపాటి జాగ్రత్తలు పెద్ద ప్రమాదాలను నివారిస్తాయని పేర్కొంటూ తెలంగాణ ప్రజలందరికీ EMRI GHS -- 108 అత్యవసర సేవల తరఫున దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

నవంబర్ 20లోగా పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- హుజూర్‌నగర్ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.30 లక్షల పనులను పరిశీలించిన కలెక్టర్
- విద్యార్థినుల కోసం టెన్నిస్, వాలీబాల్ కోర్టులు.. ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని ఆదేశం

హుజూర్‌నగర్, నవంబర్ 8 (ప్రజా నేస్తం జ్వాల):

హుజూర్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ నవంబర్ 20వ తేదీలోగా పూర్తి చేసి విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 'నెక్ట్ జనరేషన్ సూర్యాపేట' కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు మంజూరైన రూ.30 లక్షల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొనసాగుతున్న సివిల్ పనులు, ప్రధాన మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యత, అమలు తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణంతో పాటు క్రీడలు, సాంకేతిక విద్యకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పాఠశాల క్రీడా మైదానాన్ని పూర్తిస్థాయిలో చదును చేసి విద్యార్థినులు క్రీడల్లో రాణించేలా ప్రత్యేకంగా టెన్నిస్, వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఆధునిక సదుపాయాలతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌ను త్వరితగతిన సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పాఠశాల భవనాల మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, పనుల విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు సూచించారు. నవంబర్ 20వ తేదీని తుది గడువుగా నిర్ణయించి, అప్పటిలోగా అన్ని పనులు పూర్తి చేసి విద్యార్థినులకు అందుబాటులోకి



తీసుకురావాలని ఆదేశించారు.

విద్యార్థినుల ప్రతిభపై కలెక్టర్ ప్రశంసలు

అభివృద్ధి పనుల పరిశీలన అనంతరం కలెక్టర్ పాఠశాలలోని తొమ్మిదో తరగతి గదిని సందర్శించి విద్యార్థినులతో ముచ్చటించారు. వారి పుస్తక పఠన సామర్థ్యాన్ని పరిశీలించడంతో పాటు పాఠ్యాంశాలకు సంబంధించిన పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. విద్యార్థినులు చురుకుదనంతో, ఆత్మవిశ్వాసంతో సమాధానాలు చెప్పడంతో వారి ప్రతిభను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానంలోనూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ డి. నర్సిరెడ్డి, స్థానిక ఆర్డీవో, తహశీల్దార్, డీఈ రమేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల కోసం ఎంజీఎం సిబ్బంది ధర్నా.. నిలిచిన సేవలు

- నెల రోజులుగా అదనపు విధులు నిర్వహిస్తున్నా వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన
- సమ్మెతో రోగులు, వారి బంధువులకు ఇబ్బందులు

హనుమకొండ, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బంది పెండింగ్ వేతనాల కోసం ఆందోళనకు దిగారు. శనివారం విధులను బహిష్కరించి నిరసన చేపట్టడంతో ఆసుపత్రిలో పలు సేవలకు అంతరాయం ఏర్పడింది. నెల రోజులుగా అదనపు విధులు నిర్వహిస్తున్నప్పటికీ తమకు వేతనాలు చెల్లించడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోనూ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నామని, అయినప్పటికీ తమ శ్రమకు తగిన వేతనాలు అందడం లేదని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీకృష్ణ ఏజెన్సీ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. వేతనాలు చెల్లించే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సిబ్బంది విధులను



బహిష్కరించడంతో ఎంజీఎం ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ఇతర సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆసుపత్రి యాజమాన్యం, సంబంధిత ఏజెన్సీ అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని సిబ్బంది కోరుతున్నారు.

కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

హనుమకొండ, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ విద్యార్థుల 1, 3, 5వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణ విభాగం అధికారులు విడుదల చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి 1, 5వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానుండగా, 17వ తేదీ నుంచి 3వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల సమయాలను కూడా అధికారులు ప్రకటించారు. 3, 5వ సెమిస్టర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. మొదటి సెమిస్టర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులు విడుదలైన పరీక్షల షెడ్యూల్‌ను పరిశీలించి, పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు.



తెలంగాణ గ్రామ పంచాయతీలకు ఊరట.. సొంత ఆదాయం నేరుగా ఖాతాల్లోకి!

హనుమకొండ, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణలోని గ్రామ పంచాయతీల ఆర్థిక నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీలకు వివిధ మార్గాల ద్వారా సమకూరే సొంత ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయకుండా, నేరుగా ఆయా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన విధానం అక్టోబర్ 9 నుంచే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో పంచాయతీల సొంత ఆదాయం ట్రెజరీ ఖాతాలో జమ కావడంతో అవసరమైన పనుల కోసం నిధులు వినియోగించుకోవడంలో జాప్యం ఎదురయ్యేది. పారిశుద్ధ్య నిర్వహణ, సిబ్బంది వేతనాలు, వీధి దీపాల నిర్వహణతో పాటు అత్యవసర అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేయాలంటే సంబంధిత అనుమతులు, బిల్లుల మంజూరు కోసం ఎదురుచూడాల్సి వచ్చేది. దీంతో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. తాజా ఉత్తర్వులతో పంచాయతీలకు సమకూరే సొంత ఆదాయాన్ని నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునే అవకాశం కలగనుంది. దీనివల్ల స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగించుకోవడం సులభతరం కానుందని భావిస్తున్నారు. అయితే, నిధుల వినియోగానికి సంబంధించిన నిబంధనలు, లెక్కల నిర్వహణ, పారదర్శకతపై ప్రభుత్వ మార్గదర్శకాలను పంచాయతీలు పాటించాల్సి ఉంటుంది.



బాలసముద్రంలో భారీగా అక్రమ ఔషధ నిల్వలు స్వాధీనం

హనుమకొండ, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ నగరంలోని బాలసముద్రం ప్రాంతంలో డ్రగ్ లైసెన్స్ లేకుండా అక్రమంగా మందులు నిల్వ ఉంచి విక్రయిస్తున్న స్థావరంపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.15 లక్షల విలువైన వివిధ రకాల ఔషధ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. బాలసముద్రంలోని ఓ నివాస గృహాన్ని అక్రమ మందుల నిల్వ, విక్రయ కేంద్రంగా వినియోగిస్తున్నట్లు ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం నాయకులు ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ సమాచారంతో స్పందించిన డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు సంబంధిత నివాస గృహంపై ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రగ్ లైసెన్స్ లేకుండా నిల్వ ఉంచిన భారీ మొత్తంలో మందులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఔషధాలను నిల్వ చేయడం, విక్రయించడం చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన ఔషధాల విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ దాడుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జె. కిరణ్ కుమార్‌తో పాటు ఔషధ నియంత్రణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం ధరల పెరుగుదలకు కళ్లెం.. కేంద్రం కీలక నిర్ణయం

హనుమకొండ, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):



దేశవ్యాప్తంగా బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది. బియ్యం ధరలను నియంత్రించడంతో పాటు అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను అరికట్టే లక్ష్యంతో వ్యాపారులు, మిల్లర్లకు కొత్త నిబంధనలు విధించింది. తమ వద్ద ఉన్న ధాన్యం, బియ్యం నిల్వల వివరాలను ప్రతి శుక్రవారం అధికారిక ఫుడ్ స్టాక్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించింది. ఈ నిబంధనల ప్రకారం బియ్యం వ్యాపారులు, రైస్ మిల్లర్లు తమ వద్ద ఉన్న నిల్వల వివరాలను క్రమం తప్పకుండా వెల్లడించాల్సి ఉంటుంది. తద్వారా మార్కెట్లో బియ్యం నిల్వలు, సరఫరా పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుంది. నిల్వల వివరాల్లో పారదర్శకత పెంచడంతో పాటు ధరల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవచ్చని కేంద్రం భావిస్తోంది.

ఐదు రాష్ట్రాలకు స్టాక్ లిమిట్స్ విధించే అధికారం

ధరల నియంత్రణ చర్యల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు ప్రత్యేక అధికారాలను కల్పించింది. ఆయా రాష్ట్రాల్లో బియ్యం నిల్వలు, మార్కెట్ పరిస్థితులు, స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్టాక్ పరిమితులు విధించుకునే అవకాశం కల్పించింది. ఈ అధికారాలను 2027 జనవరి 31వ తేదీ వరకు వినియోగించుకోవచ్చని కేంద్రం వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో బియ్యం నిల్వలు, సరఫరాపై పర్యవేక్షణ మరింత పెరగనుంది. వ్యాపారులు, మిల్లర్లు నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఈ చర్యలు బహిరంగ మార్కెట్లో బియ్యం ధరల స్థిరీకరణకు, వినియోగదారులకు సరసమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉండేందుకు దోహదపడతాయని భావిస్తున్నారు.

ఎక్స్ గర్ల్‌ఫ్రెండ్ సమాచారం కోసం ఆర్టీఐలో 1,886 ప్రశ్నలు

హనుమకొండ, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

మాజీ ప్రియురాలి వ్యక్తిగత వివరాలు తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టాన్ని (ఆర్టీఐ) దుర్వినియోగం చేసిన ఓ యువకుడిపై తమిళనాడు సమాచార కమిషన్ కఠిన చర్యలు తీసుకుంది. ఏకంగా 97 ఆర్టీఐ దరఖాస్తులు సమర్పించి, మొత్తం 1,886 ప్రశ్నలతో యువతి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివరాలు కోరినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కమిషన్ సదరు వ్యక్తిపై ఏడాది పాటు ఆర్టీఐ దరఖాస్తులు దాఖలు చేయకుండా నిషేధం విధించింది. వివరాల్లోకి వెళితే.. తమిళనాడులోని విల్లుపురంలో 2021 నుంచి 2024 మధ్యకాలంలో కలిసి చదువుకున్న ఓ యువకుడు, యువతి మధ్య పరిచయం ఏర్పడింది. అనంతరం ఇద్దరూ దూరమయ్యారు. ఈ నేపథ్యంలో యువకుడు తన మాజీ ప్రియురాలి వ్యక్తిగత వివరాలు తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టాన్ని ఆశ్రయించాడు. ఆమె ఎంతమందితో డేటింగ్ చేసింది? వివాహం జరిగిందా? ప్రస్తుతం జీవించి ఉందా? వంటి వ్యక్తిగత అంశాలపై ప్రశ్నలు సంధిస్తూ వరుసగా దరఖాస్తులు సమర్పించాడు. ఇలా మొత్తం 97 దరఖాస్తుల ద్వారా 1,886 ప్రశ్నలు అడగడంతో ఈ వ్యవహారం సమాచార కమిషన్ దృష్టికి వెళ్లింది. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివరాలను సేకరించేందుకు ఆర్టీఐని పదేపదే ఉపయోగించడాన్ని కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో సదరు యువకుడు ఏడాది పాటు ఎలాంటి ఆర్టీఐ దరఖాస్తులు సమర్పించకుండా నిషేధం విధించడంతో పాటు, అతడికి మానసిక కౌన్సెలింగ్ ఇప్పించాలని సంబంధిత శాఖను ఆదేశించినట్లు సమాచారం. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన సమాచారం పొందేందుకు ఉద్దేశించిన సమాచార హక్కు చట్టాన్ని వ్యక్తిగత కక్షలు, వేధింపులకు ఉపయోగించకూడదనే అంశాన్ని ఈ ఘటన మరోసారి చర్చకు తెచ్చింది.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు.. మానవత్వం చాటుకున్న సర్పంచ్

ముల్కనూర్, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):



మానవత్వమే మిన్న అని నిరూపించారు ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీప బస్టాప్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు.మృతుడికి కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరూ లేకపోవడంతో గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు జరిపించి తన సేవాభావాన్ని చాటుకున్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించిన సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డిపై పలువురు ప్రశంసలు వ్యక్తం చేశారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



సూర్యాపేట జిల్లా, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):

హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వివిధ విభాగాల పనితీరు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మౌలిక వసతులను పరిశీలించారు.అనంతరం డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బందితో సమావేశమై వైద్య సేవల నిర్వహణ, ఆసుపత్రిలో చేపడుతున్న పనులు, అందుబాటులో ఉన్న వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ బాలికల పాఠశాలలో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.అలాగే రామస్వామిగట్టు సమీపంలో నిర్మించిన 2,160 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన అంశాలపై ఆర్డీఓ, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ నాగేందర్, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, వైద్యులు నక్క రవి, యోగేందర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జి.కె. అన్నారంలో ఇంటింటికీ దీపావళి సంబరాలు

గ్రామంలో పర్యటించి ప్రజలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 7 (ప్రజానేస్తం జ్వాల):



నల్గొండ మండలంలోని జి.కె. అన్నారం గ్రామంలో నిర్వహించిన ‘ఇంటింటికీ దీపావళి’ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి పెర్ల లక్ష్మమ్మ, నలపరాజు ముత్తమ్మ, సూడి రెడ్డి రంజిత, గోపిడి పద్మమ్మ ఇళ్లలో నిర్వహించిన దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు.గ్రామస్థులతో కలిసి పండుగ సంబరాల్లో పాలుపంచుకున్న కలెక్టర్ వారికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి ఆనందంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీవీఏహెచ్ఓ, పీడీ హౌసింగ్, నల్గొండ ఎంపీడీఓ, స్థానిక సర్పంచ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి చేరుకున్న కడియం శ్రీహరి, ఎంపీ కావ్యలకు ఘన స్వాగతం



వేలేరు: అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కావ్యలను పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరితో పాటు సర్పంచులు బత్తుల శ్రీనివాస్, మాలోతు రాజు, మాలోతు అరుణ నాగరాజు, వేలేరు మండల యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసుల సంక్షేమానికి ప్రత్యేక కార్యాలయం

సూర్యాపేట, నవంబర్ 8 (ప్రజానేస్తం జ్వాల):

పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడ ప్రాంతంలో రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లపాటు ప్రజలకు సేవలందించిన పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బంది సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందాలని ఆకాంక్షించారు. వారి సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.రిటైర్డ్ పోలీసు అధికారులు, సిబ్బంది ఒకే వేదికపై సమావేశమై తమ అనుభవాలను పంచుకోవడానికి, పరస్పర సహకారంతో ముందుకు సాగడానికి ఈ కార్యాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. వారి సంక్షేమానికి పోలీస్ శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, రిటైర్డ్ పోలీసు ఉద్యోగులు, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి

- **దీపాల కాంతులవలె ప్రతి ఇంటా వెలుగులు నిండాలి**
- **బాణసంచా పేల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలి: మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి**

సూర్యాపేట (ప్రజానేస్తం జ్వాల):

చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి అని, దీపాల కాంతులవలె తెలంగాణలోని ప్రతి ఇంటా సంతోషం, సౌభాగ్యం వెల్లివిరియాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆకాంక్షించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నరకాసుర వధకు ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రజల జీవితాల్లోని చీకట్లను తొలగించి వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని పేర్కొన్నారు. దీపాల వెలుగులు అజ్ఞానాంధకారాన్ని తొలగించి, ప్రజల్లో చైతన్యాన్ని నింపాలని అన్నారు. దీపావళి వేడుకల్లో భాగంగా బాణసంచా కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలకు తావులేకుండా పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. కార్తీక మాసంలో నిర్వహించే పూజలు ప్రజలందరికీ శుభఫలితాలను అందించాలని ఆకాంక్షిస్తూ మరోసారి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థికి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో స్వర్ణం

ధర్మసాగర్, నవంబర్ 7 (ప్రజాస్టస్తం జ్వాల):

ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన సీఈసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి గంగారపు ప్రభుదేవ్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడు. ఖమ్మంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) రాష్ట్రస్థాయి పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు.ఈ విజయంతో నవంబర్ 11 నుంచి మధ్యప్రదేశ్‌లో జరగనున్న ఎస్‌జీఎఫ్ఐ జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. 400 మీటర్ల పరుగు పందెంతో పాటు 400 మీటర్ల రిలే విభాగంలోనూ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నాడు.ప్రభుదేవ్ సాధించిన విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి కళాశాలకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసంతో పాటు వ్యక్తిత్వ నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు ఉన్నత విద్య, ఉపాధి రంగాల్లో ప్రత్యేక అవకాశాలు లభిస్తాయని తెలిపారు. చదువుతోపాటు క్రీడలపైనా విద్యార్థులు శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుదేవ్ తండ్రి గంగారపు శ్రీనివాస్, అధ్యాపకులు ప్రభాకర్, వెంకట్, గణేష్, సదానందం, రవళి, వేణు, చంద్రమౌళి తదితరులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.



జగన్ నమ్మకాన్ని నిలబెట్టిన మండవ శ్రీనివాస్ గౌడ్

- **జగ్గయ్యపేట జెడ్పీటీసీగా ఘన విజయం.. బీసీ నాయకుడి రాజకీయ ప్రస్థానంలో మరో మైలురాయి**

జగ్గయ్యపేట, నవంబర్ 7, (ప్రజానేస్తం జ్వాల):

బీసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ రాజ్యాధికార సాధన కోసం నిరంతరం పోరాటం సాగిస్తున్న మండవ శ్రీనివాస్ గౌడ్ జగ్గయ్యపేట జెడ్పీటీసీ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆయనపై నమ్మకంతో జెడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించగా, ప్రజల మద్దతుతో అత్యధిక మెజారిటీ సాధించి ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బీసీల హక్కుల కోసం తన గళాన్ని వినిపిస్తూ, బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో శ్రీనివాస్ గౌడ్ నిరంతరం కృషి చేస్తున్నారు. రాజకీయ అండదండలు పరిమితంగా ఉన్నప్పటికీ తన పోరాట పటిమ, పట్టుదల, ప్రజలతో ఉన్న అనుబంధంతో ముందుకు సాగారు.జగన్ మోహన్ రెడ్డి తనపై ఉంచిన విశ్వాసాన్ని ప్రజా తీర్పుతో విజయంగా మలచుకున్న మండవ శ్రీనివాస్ గౌడ్‌కు ఈ విజయం రాజకీయంగా ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. ఈ గెలుపు వ్యక్తిగత విజయానికే పరిమితం కాకుండా బీసీల ఆత్మగౌరవానికి, సామాజిక న్యాయం కోసం సాగుతున్న పోరాటానికి లభించిన గుర్తింపుగా ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు అభివర్ణిస్తున్నారు.జెడ్పీటీసీగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, బీసీల హక్కుల సాధనతో పాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మరింత సేవలందించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండవ శ్రీనివాస్ గౌడ్‌కు అభిమానులు, బీసీ సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

